ఇదేం ప్లానింగ్?

- హౌస్ ప్లానింగ్ కోసం తప్పని ఇబ్బందులు
- నెల రోజులుగా మెయింటెనెన్స్ పేరిట స్తంభించిన వెబ్‌సైట్
- ఎదురుచూపుల్లో దరఖాస్తుదారులు
- పెండింగ్‌లో సర్క్యులేషన్ పేట్రన్ అంశం
- సుడా అధికారులు లేకుండానే మాస్టర్ ప్లాన్‌పై చర్చ



శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం

శ్రీకాకుళం: నగరంలో ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న యజమానులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనుమతులు మంజూరు కోసం నెల రోజులకు పైగా ఎదురుచూపులు తప్పడం లేదు. వెబ్‌సైట్ మెయింటెనెన్స్ పేరుతో నెల రోజుల క్రితం దీనిని నిలుపుదల చేశారు. ప్రతి ఏడాది ఈ విధానం పరిపాటే అయినప్పటికీ ఐదు నుంచి ఏడు రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసి అనుమతులు ఇచ్చేవారు. ఇప్పుడలా కాకుండా వెబ్‌సైట్ ప్రారంభించే తేదీనే నెల రోజులకు పైగా అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఐదు సార్లు ఈ ప్రక్రియను వాయిదా వేశారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమవుతుందని తాజాగా ప్రకటించినా అమలు అవుతుందా? లేదా? అనే సందేహం నెలకొంది. వెబ్‌సైట్ ప్రారంభం కాకపోవటంతో శ్రీకాకుళం నగరానికి రాష్ట్రంలో తొలిసారిగా అమలు కాబోతున్న సర్క్యులేషన్ పేట్రన్ అంశం కూడా పెండింగ్‌లోనే ఉండిపోయింది. మరోవైపు ప్లాన్ల అనుమతి లేకపోవటం వల్ల మున్సిపాల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

సుడా అధికారులు లేకుండా మాస్టర్‌ప్లాన్ చర్చ..

ఈ నెల 10న బాపూజీ కళామందిర్‌లో మాస్టర్ ప్లాన్‌పై చర్చ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. వాస్తవానికి ఈ ప్రక్రియ సుడా నేతృత్వంలో జరగాల్సి ఉంది. అయితే సుడాలోని కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో నగరపాలక సంస్థలోని అధికారులే సుడా పోస్టులు నిర్వహిస్తున్నారు. సుడాలోని ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి హాజరవుతుండటంతో ఆ విభాగం నుంచి హాజరు ఉన్నట్లు చెబుతున్నారు. నిజానికి మాస్టర్‌ప్లాన్‌పై చర్చ గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. దీనిపై సలహాలు, అభ్యంతరాలు అప్పట్లో స్వీకరించారు. సుడా అధికారులు నివేదికను ప్రభుత్వాన్ని పంపేందుకు సిద్ధం చేశారు. కారణం తెలియనప్పటికీ నివేదిక సుడాలోనే ఉండిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం మరోసారి చర్చను జరిపి ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించాలని నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను తమకు ఇష్టం వచ్చినట్లు మార్చుకున్న విషయం పాఠకులకు విదితమే. ఈసారైన ప్రజల ఇష్టాలకు దీనిని అమోదిస్తారో? లేదో? వేచి చూడాలి.

11 నుంచి వెబ్‌సైట్ ఓపెన్.



టౌన్ ప్లానింగ్ వెబ్‌సైట్ ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు సమాచారం వచ్చింది. వెబ్‌సైట్ ప్రారంభం కాగానే పెండింగ్ ప్లాన్లను అనుమతి ఇస్తాం. సర్క్యులేషన్ ప్యాట్రన్ కూడా ఆమోదిస్తాం. సుడాలోని ప్రణాళికా విభాగం అధికారి సమావేశంలో పాల్గొంటున్నారు. ఇది ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుసుకునే సమావేశం మాత్రమే.

– ప్రసాదరావు, కమిషనర్, నగరపాలక సంస్థ, శ్రీకాకుళం

క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు పూజ చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం, రామజోగిపేటలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న సిమ్మెంట్ రోడ్డు పనులకు ఎంపీపీ మొదలవలస చిరంజీవి శనివారం శంకుస్థాపన చేశారు. రామజోగిపేటలో రూ.4 లక్షలు, బుడగుట్లపాలెంలో రూ.6 లక్షల వ్యయంతో ఈ పనులు చేయనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి రాంబాబు, ముద్దాడ సర్పంచ్ ముద్దాడ శంకర్, నాయకులు అల్లు సూర్యనారాయణ, లక్షణరావు, రామారావు పాల్గొన్నారు.

అసిరితల్లికి అభిషేకాలు


పూజలందుకుంటున్న అసిరితల్లి

గార: మండలంలోని కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామదేవత అసిరితల్లికి శనివారం ప్రత్యేక అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొనగా, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం మంటపం వద్ద దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెంకన్నకు లక్ష తులసీ దళార్చన


పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం లక్ష తులసీదళార్చన నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా పది రోజుల పాటు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు శ్రీవారికి తులసీదళాలతో పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగి కుటుంబానికి సాయం


కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఏడీ దుర్గారావు, సిబ్బంది

ఎచ్చెర్ల: రణస్థలం మండలం ఎర్రవరం సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేసిన మురపాక గ్రామానికి చెందిన గొర్లె కోటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని రణస్థలం, లావేరు మండలాల సచివాలయాల పశుసంవర్ధక శాఖ సిబ్బంది శనివారం పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ దుర్గారావు, జె.వి.వి.రవికుమార్, సచివాలయ ఉద్యోగులు గొర్లె గోపాలకృష్ణ, రాజేశ్వరీ, సతీష్, బి.రమేష్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

గోమాత సేవలో భక్త జనం


గోవుకు పూజ చేస్తున్న భక్తులు

రణస్థలం: కోష్ట గ్రామ సమీపంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం గో–సేవ ఆశ్రమంలో త్రిదండి కేశవ మహరాజ్ స్వామీజీ ఆధ్వర్యంలో శనివారం గోపాష్టమి ఘనంగా నిర్వహించారు. గోపూజ, గోహారతి, గో ప్రదక్షిణ, మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విచ్చేసి గోశాలకు ఒక నెల జీతం వితరణగా ప్రకటించారు.

ప్రత్యేక బస్సులపై విస్తృత ప్రచారం


ప్రత్యేక బస్సుల కరపత్రాలను అయ్యప్పస్వాములతో ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు


పంచారామాలు, శైవక్షేత్రాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసం సందర్భంగా పంచారామాలు, శబరిమల, శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ కోరారు. శనివారం బలగ అయ్యప్ప దేవాలయంతో పాటు ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక బస్సుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో సోమవారం ఒక్క రోజున పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకోవచ్చని తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.2,450, అల్ట్రాడీలక్స్ బస్సుకు రూ.2,350, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.2000గా చార్జీ నిర్ణయించామని వివరించారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరి సోమవారం పంచారామాలను దర్శింపజేసి మరలా మంగళవారం ఉదయం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు బస్సులు చేరుకుంటాయని తెలిపారు. శబరిమల 5 రోజుల యాత్రకు సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.7000, ఆరు రోజుల యాత్రకు రూ.7,400, వారం రోజుల యాత్రకు రూ.8,000గా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలోని శ్రీముఖలింగం, రావివలస, సంగమేశ్వరాలయం, ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయం, శ్రీచక్రపురం తదితర పుణ్యక్షేత్రాల సందర్శనకు పల్లెవెలుగు బస్సుకు రూ.350గా చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీకూర్మం, శ్రీమున్నార్ రాజగోపాలస్వామి ఆలయం(విజయనగరం), రామతీర్థం, రామనారాయణం, శ్రీబాలాజీ టెంపుల్(గంట్లాం) తదితర పుణ్యక్షేత్రాలను ఒకేరోజు దర్శించేందుకు పల్లెవెలుగు బస్సుకు రూ.350 నిర్ణయించినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 7382921647, 7382917289 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ పీఆర్‌వో కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి సూర్యదర్శనం ప్రవచనాలు


ప్రవచన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు సామవేదం షణ్ముఖశర్మచే సూర్యదర్శనం ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉపనిషన్మందిరంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, ఉపనిషన్మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్‌లు మాట్లాడుతూ బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గుత్తు చిన్నారావు, కొంక్యాన మురళీధర్, నక్క శంకరరావు, విశ్వనాథ కామేశ్వరరావు, మందుల మోహనరావు, డాక్టర్ కోమలరావు, ఎస్.నారాయణమూర్తి, పతంజలి శాస్త్రి, గుంటుకు విశ్వేశ్వరరావు, తంగుడు ప్రసాదరావు, పెద్ది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాజఠలేశ్వరునికి పుష్పాభిషేకం


పుష్పాలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరునికి శనివారం పుష్పాభిషేకం నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు చేశారు. ముందుగా మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాత

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పొందూరుకు చెందిన మలిపెద్ది లక్ష్మి రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజుకు ఈ విరాళాన్ని శనివారం అందజేశారు. తన భర్త రాజబాబు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు దాత లక్ష్మి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రపూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పెద్దపాడులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపినెస్ కేంద్రంలో బెంగుళూరుకు చెందిన ఆశ్రమ వేదపండితులతో శుక్రవారం రాత్రి రుద్రపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎల్‌వో జిల్లా ప్రతినిధి డాక్టర్ కింజరావు అమ్మన్నాయుడు మాట్లాడుతూ స్వార్థం వీడి ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలన్నారు. అనంతరం జరిగిన సత్సంగంలో రామ్మోహన్, రవి, లక్ష్మణరావులు భజన గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో దేసూళ సురేంద్ర, వారణాసి సందీప్, కొఠారి రేణుక, డి.రవి, కేఎస్ఎస్‌మూర్తి, శ్రీనివాసరెడ్డి, కాత్యాయని, అమరావతి, లక్ష్మీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

చెరువుకాదు రోడ్డే!



శ్రీకాకుళం నగరంలో వరంకాలనీ సత్యసాయినగర్ 7వ లైన్‌లో రోడ్డు చెరువును తలపిస్తోంది. మురుగునీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నులు కట్టించుకోవడంలో ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో చూపడం లేదని మండిపడుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

దోమలకు ఆవాసం



ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల సమీపంలో నివాస సముదాయాల వద్ద డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఆ ప్రాంతమంతా దోమలు, ఇతర క్రిములకు ఆవాసంగా మారుతోంది. పారిశుద్ధ్యం సమస్యగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ప్రజాధనం వృథా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఓ అధికారి వాడే కారు మూలకు చేరింది. వాస్తవానికి ఈ కారుకు 15 ఏళ్లు దాటడంతో టెండర్లు పిలిచి అమ్మేయాలి. అలా చేయకుండా నిరుపయోగంగా షెడ్‌లో పెట్టారు. మరోవైపు, ఓ అధికారి కోసం రోజుకు రూ.3500 అద్దె చెల్లించి కారు తీసుకున్నారు. నిబంధనల మేరకు కారు అద్దె నెలకు రూ.35 వేలు దాటకూడదు. ఇలా అవసరం లేకున్నా లక్షల రూపాయల ప్రజాధనం వృథా చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

ముంచుతున్న మంచు



మంచు తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. దీని ప్రభావం పెసర, మినుము, ఉలవ తదితర అపరాల పంటలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే అధికమొత్తం వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేసి పొలంలో వేశామని, మంచు ప్రభావంతో నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– జి.సిగడాం

నిస్సహాయులకు అండగా..


వ్యక్తికి సపర్యలు చేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: మతి స్థిమితం లేకుండా శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో తిరుగుతున్న వ్యక్తికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం సపర్యలు చేశారు. క్షురకర్మ చేసి స్నానం చేయించి కొత్త దుస్తులు అందజేసి భోజనం పెట్టారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ నగరంలోనే కాకుండా జిల్లాలో ఎక్కడ నిస్సహాయులు ఉన్నా తమకు తెలియజేస్తే రెడ్‌క్రాస్ తరఫున ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌పుత్ జీవన్‌సింగ్, నంది ఉమాశంకర్, జి.పవన్‌కుమార్, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

అలరించిన ‘ప్రమీలార్జునీయం’ హరికథ


హరికథా భాగవతార్ యతిరాజును సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరగనున్న నెలవారి సంగీత కార్యక్రమంలో భాగంగా శనివారం బాపూజీ కళామందిర్‌లో హరికథా ప్రదర్శన చక్కగా సాగింది. విశాఖకు చెందిన హరికథా భాగవతార్ బొంతలకోటి యతిరాజు ‘ప్రమీలార్జునీయం’ హరికథను హృద్యంగా చెప్పారు. కార్యక్రమంలో బండారు చిట్టిబాబు, డాక్టర్ పి.మాలతి, మావుడూరు శ్రీనివాసరావు, ఇప్పిలి శంకరశర్మ, మావుడూరు సత్యనారాయణ, మండా శ్రీనివాసరావు, సోమకుమారి, నిక్కు హరిసత్యనారాయణ, మార్గదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా- నలుగురికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ :


అంబులెన్సులో క్షతగాత్రులు

జిల్లాకేంద్రంలోని కిమ్స్ సమీపంలో ఆటో బోల్తాపడిన నలుగురికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం ఎచ్చెర్లలోని తన అమ్మమ్మ ఇంటింటికి వెళ్లేందుకు డిగ్రీ మొదటి సంవత్సర విద్యార్థి గేదె గోవింద డేఅండ్‌నైట్ వద్ద ఆటో ఎక్కాడు. డైన్ హౌస్ రెస్టారెంట్ వద్దకు వచ్చేసిరికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారున్ని ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో గోవిందతో పాటు సవలాపురపు కృష్ణవేణి, వడ్డి సూరయ్య, ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రబీకైనా సాగునీరు అందేనా?

- మొక్కజొన్న రైతుల ఎదురుచూపులు
- మడ్డువలస ప్రాజెక్టు ద్వారా చుక్కనీరు అందని వైనం


నాగులవలస వద్ద సాగునీటి కాలువ దుస్థితి

జి.సిగడాం : మడ్డువలస ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్ వరి పంటకు చుక్కనీరు కూడా అందక మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌కైనా నీరు అందుతుందో లేదోనని మొక్కజొన్న రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వాంద్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవలపేట, పెంట, సీతంపేట, టిడివలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం, విజయరాంపురం, ఆబోతులపేట, సీతారాంపురం, మధుపాం, నల్లిపేట తదితర గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పూర్తవుతున్నా ఇంత వరకు చుక్క నీరుకూడా రాలేదు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేశారు. రాజాం నియోజకవర్గం పరిధిలోని సంతకవిటి మండలం తాళాడ, మామిడిపల్లి, సురవరం, మండాకురిటి, సిరిపురం, మోదులపేట తదితర గ్రామాలకు మాత్రం నీరు చేరుతోంది. జి.సిగడాం మండలంలోని నాగులవలస నుంచి నల్లిపేట వరకు మాత్రం కాలువ ద్వారా నీరు ప్రవహించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మండల సర్వసభ్యల సమావేశంలో అధికారులను సాగునీటి విషయమై సభ్యులు నిలదీశారు. రబీకి కూడా సాగునీరు రావడం కష్టమని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు.

చలనం లేదు..



మడ్డువలస సాగునీరు మండలానికి రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. తక్షణమే సాగునీరు అందించకపోతే సీఎంకు ఫిర్యాదు చేస్తామన్నా అధికారుల్లో ఎలాంటి చలనం రాలేదు.

– పేడాడ శ్రీరామమూర్తి, దవళపేట, జి.సిగడాం

ఇబ్బంది పడుతున్నాం..



కాలువల ద్వారా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. కాలువను నమ్ముకుని సాగుచేస్తే కష్టాలు తప్పడం లేదు. మడ్డువలస సాగునీరు అందించాలి. లేకపోతే రబీలో పంటలు సాగు చేయం.

– బుడారి లక్ష్మణరావు, సంతవురిటి, జి.సిగడాం